# కమిలిన కసుగాయ

ఇప్పటిమాట కాదు. ఏడాదయిందనుకుంటాను. కూనూరు వెళ్ళి తిరిగి వస్తున్నాను! 'ఉడిపి'లో భోంచేసి బస్సుస్టాండు కెళ్ళాను. కాస్త ముందుగా బస్సు కదిలిపోయింది. మళ్ళీ మధ్యాహ్నం మూడింటికి కాని బస్సులేదు. చేసేదిలేక రైల్వేస్టేషనుకు వెళ్ళాను. స్టేషన్నిండా జనం. ఏమిటీ అంటే మద్రాసునుంచి వచ్చే నీలగిరి ఎక్స్‌ప్రెస్ మూడుగంటలు లేటట. ఆ వైపునుండి రైలువస్తే కొండఎక్కి ఊటీవైపుకు వెళ్ళేవాళ్ళూ, ఇటునుంచి రైలువస్తే కొండదిగి మెట్టుపాలయంవైపు వెళ్ళేవాళ్ళూ అందరూ గంటనుంచి స్టేషనులోనే మకామట. ఎక్కడైనా కూర్చుందామంటే సిగరెట్లపొగ, బీడీలపొగ. అదేపనిగ తమలపాకులు నమిలే మనుష్యుల మధ్య నిల్చోడానికి సాహసంలేక నడుచుకుంటూ ప్లాట్‌ఫారం చివర కెళ్ళాను. అక్కడ ఓ సిమెంటు బెంచి వుంది. ఆ బెంచిమీద ఒకబ్బాయి కూర్చుని వున్నాడు. పదేళ్ళుంటాయేమొ. మణికట్లవరకూ షర్టు, సీలమండలవరకు పేంటు వేసుకున్నాడు. కాని ఏ ఆచ్ఛాదనాలేని ఆ అబ్బాయి ముఖము, ముంజేతులు చూసేసరికి నా ఒళ్ళు గరపొడిచింది. ఎగ్జిమానేమో పాపం అనుకున్నాను. కలిగినట్లుగా ఎఱ్ఱగావున్నాయతని కళ్ళు. ఆ బెంచిమీద ఇంక ముగ్గురు కూర్చునే చోటున్నా, నాకక్కడ కూర్చోబుద్ధి కాలేదు. చేతిలోసంచీ బెంచిమీద పెట్టాను. పేపర్లమ్మేకుర్రాణ్ణి కేకేసి 'హిందూ' యిమ్మన్నాను. 'రైలురాలేదు గదండీ, నిన్నటి

వయిపోయినయ్. కల్కి కావాలా, కదిరి కావాలా, పేశంపటం యిమ్మంటారా' అంటూ దండకం మొదలుపెట్టాడు పేపరు కుర్రాడు. వదలేక 'కల్కి' తీసుకుని వాణ్ణి అవతలికి పంపించాను. పేజీలు తిరగేస్తున్నా.

"మీరు కూర్చుంటారా, నేను వెళ్తాను" ప్రక్కకు తిరిగి చూచాను. ఆ అబ్బాయి లేచి నిల్చున్నాడు. నేను తెల్లబోయాను. "ఫరవాలేదు నువ్వు కూర్చో, థేంక్స్" అన్నాను. "కాదు మీరు యిందాకటినుంచి నిల్చునే వున్నారు. మీరు కూర్చోండి, నేను వెళ్తాను" అన్నాడబ్బాయి. చేసేదిలేక తెచ్చిపెట్టుకున్న నవ్వుతో "సరే నేను కూర్చుంటాను, నువ్వూ కూర్చో వెళ్ళిపోవడం దేనికి" అన్నాను. ఆ కుర్రాడి ముఖం చేటంత అయింది.

"నిజంగానే అంటున్నారా?"

"నీకు సందేహం దేనికి?"

"నలుగురైదుగురు యిక్కడికి వచ్చి యీ బెంచిమీద కూర్చోబోయి నన్నుచూచి వెళ్ళిపోయారు. మీరు వచ్చారు, మీరుకూడ కూర్చోలేదు యిహ నేనే వెళ్దామనుకున్నాను. మీకుకూడ భయంవేసిందికదూ నన్నుచూసి" అన్నాడు విచారంగా నవ్వుతూ. నేనెంతో సిగ్గుపడిపోయాను. తేరుకుని "అబ్బే అదేమీ కాదమ్మా" అన్నాను. ఆ అబ్బాయి తన చేతుల వంక చూసుకుంటూ అందరు అనుకుంటారు నన్నంటుకుంటే వాళ్ళ ఒళ్ళుకూడ నా ఒళ్ళులాగ అయిపోతుందని! ఈ జబ్బు అంటుకోదూ అంటే ఎవరూ వినిపించుకోరు. మా తాతగారు నన్ను మెడ్రాసుకుకూడ తీసుకవెళ్ళి డాక్టర్లకు చూపించారు. ఎన్ని మందులు వాడినా యిది తగ్గలేదు. నేను పుట్టినప్పటినుంచి వున్నదట యీ జబ్బు. అయితే నిజం చెప్తున్నాను యిది యింకొకరికి అంటుకోదు. మా తాతగారిని చూడండి, మా అవ్వను చూడండి ఆఖరికి మా అక్కకుకూడ అంటుకోలేదు."

నా పిరికితనాన్ని ఎత్తి చూపినట్లయింది. ఆ జబ్బు సంగతి వినడానికి యిష్టంలేక మాట మారుద్దామని "మీ అక్క ఏదిమరి. నువ్వొక్కడివే వచ్చావేం?" అన్నాను. ఆ అబ్బాయి నవ్వి "మీకు మా అక్క సంగతి తెలియదు. దానికి ఎప్పుడూ తిండిరంధే. దాహమేస్తున్నదని

పోరుపెట్టి మా తాతగారిని లాక్కెళ్ళింది. నాకు తెలుసు అక్కడికి వెళ్ళిందంటే బోండానో, తైర్‌వడో తినకుండా వుత్తడ్రింక్ త్రాగిరాదు. రోజూ సాయంత్రం పార్కుకు కెళ్దామని గోలచేస్తుంది ఎందుకో తెలుసా, అక్కడ సుండలు అమ్ముతారుగా, అందుకు" అంటూ బిగ్గరగా నవ్వాడు ఆ అబ్బాయి. నాకు నవ్వు వచ్చింది. "స్కూలుకెళ్తున్నావా? ఏం చదువుకుంటున్నావు" అన్నాను మాటలు పెంచే ధోరణిలో.

ఆ అబ్బాయి ముఖంలో నవ్వు నామమాత్రానికైనా లేకుండా తుడిచిపెట్టుకపోయింది. "మా అక్క సెయింట్ ఫ్రాన్సిస్‌లో చదువుతోంది. వాళ్ళు నన్ను చేర్చుకోలేదు. యీ వూళ్ళో ఏ స్కూల్లోనూ నన్ను చేర్చుకోమన్నారు. నాతో ఆడుకుంటే తక్కిన పిల్లలందరికి యీ జబ్బు వస్తుందట. కాదూ యీ జబ్బు అంటుకోదూ అని ఎంత చెప్పినా వాళ్ళు వినందే! వాళ్ళు వుత్త తెలివిలేనివాళ్ళు కదండీ" అన్నాడు.

ఎంత తప్పించాలన్నా సంభాషణ తిరిగి అక్కడికే వచ్చింది.

"మరయితే యింటిదగ్గర చదువుకుంటావా? ఎవరు చెప్తారు నీకు చదువు" అనడిగాను.

"రోజూ సాయంత్రం ఒక టీచరు వస్తుంది. నేనంటే ఎంతో యిష్టమామెకు. భలే మంచిది ఆమె. కాని మా అక్క ఒప్పుకోదు "ఓహో యింతకన్నా మంచి 'మిస్సులు' మా స్కూల్లో బోలెడుమంది వున్నారు" అంటుంది, నేను నమ్మను. మా టీచరుకన్నా మంచిగా ఎట్లా వుంటారు? వుంటే నన్ను స్కూల్లో చేర్చుకునేవుందురు కదండీ?" "మీది యీ వూరేనా, యిల్లెక్కడ" అనడిగాను. "ఈ వూరే, మా యిల్లు స్టేషనుకు దూరమే. 'మౌంట్ ప్లెజెంట్' తెలుసా, అక్కడుంది మా యిల్లు. మా యింటిపేరు రోజ్‌బెడ్" అని నవ్వాడు ఆ అబ్బాయి.

"ఎందుకు నవ్వుతున్నావు?"

"మా యింటిపేరు వింటే మీకు నవ్వురావడంలేదూ! కూనూర్‌లో గులాబిమొక్క లేని యిల్లు మా యిల్లు ఒక్కటే! పేరేమో 'రోజ్‌బెడ్.' మా అమ్మ చిన్నప్పుడు మా యింట్లో బోలెడు గులాబీలు పూసేవని

తాతగారంటారు. యిప్పుడు నన్ను పేరు మార్చమంటే, నేను మా యింటిని "అకేషియా కాటేజ్" అని పిలుస్తాను. మా యింట్లో యిప్పుడు తుమ్మచెట్లు తప్ప ఇంకేం లేవు" అన్నాడు.

'ఎంత చిత్రమయిన కుర్రాడు!' అనుకున్నాను. మాటలు పొడిగించకుండా 'కల్కి' తెరిచి ఒక కథ చదవడం మొదలుపెట్టాను!

"యీ సంచిలోవేమిటి, పళ్ళు కొనుక్కొని పెళ్తున్నారా!"

"ఔను" అంటూ పైకి కనబడుతున్న బేరికాయ తీసి అతనికిచ్చాను, తీసుకోలేదు.

'నేనూరికే అడిగాను' అన్నాడు. ఫరవాలేదు తీసుకోమని ఇచ్చాను.

"ఆ ఎఱ్ఱటి వేమిటి, ట్రీ టోమాటాలా?" అన్నాడు. "ఔను, తింటావా, నీకిష్టమేనా?" అని ఒకటి తీసివ్వబోయాను.

"అబ్బే వద్దు అది వట్టినే తింటానికి బాగుండదు. దాంతో రసం చేస్తారు. మీ కిష్టమేనా?" అనడిగాడు.

ఆ కాయలతో చారు కాస్తారని నాకు తెలియదు. "వాటితో రసం పెడ్తారా నాకు తెలీదే" అన్నాను.

"నిజంగా మీకు తెలియదా! ఆ రసం బలే బాగుంటుంది. మా అవ్వ ట్రీ టొమాటో రసం పెడితే మా తాతగారు పడిబియ్యం అన్నం తినేస్తారు. 'నేను రసం బాగుందికద తాతా' అంటే "అబ్బే మీ అవ్వకు రసం పెట్టడం బాగా చేతకాదురా, మా అవ్వ పెట్టేది రసం, ఎట్లా వుండేదని," అంటారు. మీరు చెప్పండి మా అవ్వకన్నా బాగా రసం ఎవరు పెడ్తారు?" అన్నాడు.

"సరేకాని ఏవూరెళుతున్నావు"

"నేనా, నేనేవూరు వెళ్ళడంలేదు, మీకు యిందాక చెప్పాను. నేను ఒకసారి మెద్రాసు వెళ్ళానని. అంతే అదొక్కసారే నేను వూరు వెళ్ళింది. నేనెప్పుడు ఎక్కడికీ వెళ్ళను" అన్నాడు.

నేనేమి మాట్లాడలేదు. మళ్ళీ చదువుతున్న కథ అందుకున్నాను.

"మీకు లలితాదేవి తెలుసునా" అని పల్కరించాడు.

"ఏ లలితాదేవి" అన్నాను.

"ఢిల్లీలో లలితాదేవి మీకు తెలియదా? మీరు ఢిల్లీ వెళ్ళలేదా ఎప్పుడూ" అన్నాడు.

నేను ఢిల్లీ వెళ్ళాను కాని యీ లలితాదేవి ఎవరో నాకు అంతుపట్ట లేదు. పార్లమెంటు సభ్యుల్లోకూడ ఆ పేరు కలవాళ్ళు వున్నట్లు లేరే! "ఎవరామె నాకు తెలియదే" అన్నాను.

"ఆమె - మా అమ్మ యీవాళ వస్తున్నది. అందుకే స్టేషనుకు వచ్చాము" అన్నాడు.

కుర్రాడు బంగారంకాను ఎంత కంగారు పెట్టేశాడు! "మీ అమ్మ ఢిల్లీలో ఏంచేస్తున్నారు?"

"చదువుతున్నారు" అన్నాడు.

ఆ అబ్బాయికి పదేళ్ళుంటాయి. ఆ అబ్బాయికి ఒక అక్క వుంది. వాళ్ళమ్మ యిప్పుడు చదవడమేమిటి!

"ఏం చదువుతున్నారు?"

"యం. ఏ. మీరేం చదివారు బి. యేనా?" అన్నాడు.

"ఔను. మరి మీ నాన్నగారేం చేస్తున్నారు" అనడిగాను అనవసర మైన కుతూహలాన్ని అదుపులో పెట్టలేక.

"మా నాన్నగారు ఎయిర్‌ఫోర్సులో యింజనీరుగా వుండేవారు. ఇప్పుడు లేరుగా. చచ్చిపోయి మూడేళ్ళయింది. మేము జోధ్‌పూర్‌లో వున్నప్పుడు ఎవరో తుపాకీతో కాల్చిచంపారు. అప్పుడు మా అమ్మను రెండు రోజులు జైల్లో వుంచారు. మా అమ్మ, నాన్న ఎప్పుడు పోట్లాడు కునేవారట, అందుకని. పోలీసువాళ్ళకు ఏం తెలియదు కదండీ"అన్నాడు.

నేనే భయపడిపోయాను చుట్టు ఎవరు లేరుకదా అని పరికించాను. ఎవరీ అబ్బాయి, ఏమిటితని కథ? తండ్రికి ఎయిర్‌ఫోర్సులో పని.

ఇతనికి పుట్టినప్పటినుంచి జబ్బు. తల్లికి తండ్రికి ఎప్పుడు తగువులు. తండ్రిని ఎవరో ఖూనీ చేశారు.... భయంకరంగా నడుస్తున్న యీ కథ చివరికి ఎక్కడికి చేరుకుంటుంది?

'మీ ట్రెయిన్ ముందు వచ్చిందే' అన్నాడు ఆ అబ్బాయి.

నేను నవ్వి "ఔను, మీ ట్రయినూ త్వరగానే వస్తుందిలే. మీ అమ్మగారు నీకోసం ఢిల్లీనుంచి పుస్తకాలు మిఠాయిలు పట్టుకొస్తారుకదూ! నేను వెళ్తానే యిహ!" అన్నాను. ఆ అబ్బాయి నవ్వుతూ 'బై బై' అన్నాడు

రైలెక్కి? చోటు చూసుకుని కూర్చున్నాను. రైలు నింపాదిగా కొండ దిగుతూంది. ఆ అబ్బాయి కథే నా మనసంతా నిండి ఉంది.

"తన అక్కకున్న తిండిధ్యాస యింకెవరికీ వుండదు. తన టీచరు కన్నా మంచి టీచరు ఎవరూ వుండరు. తన తల్లికన్నా పెద్ద చదువు ఎవరూ చదవరు. తన అవ్వ చారుపెట్టినట్లు యింకెవ్వరు పెట్టలేరు. డాక్టర్లు మొద్దులు, స్కూలువాళ్ళకు బుద్ధిలేదు. పోలీసువాళ్ళకు మెదడు లేదు." ఇవీ ఆ అబ్బాయి ఏర్పరచుకున్న నమ్మకాలు. ఆ అబ్బాయికి ఆ జబ్బు నయమవదు. అతణ్ణి ఏ స్కూల్లోనూ చేర్చుకోరు. ఆ అబ్బాయి పెరుగుతాడు. పెద్దవాడవుతాడు, బ్రతుకుతాడు కాని ఎట్లా—?" నాకేమి జవాబు దొరకలేదు. సజీవమైన విషాదాన్ని నేనదే చూడటం! ఏడాదయి పోయింది. ఆ అబ్బాయి నా గుర్తులోంచి పోలేదు.

—o—